
# ‘శ్రీహరి’ని భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఇంటింటికీ అందిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు
- జడ్పీటీసీ ఇల్లందుల బేబీ
- గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం



స్టేషన్ ఘన్‌పూర్ : తాటికొండలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



జఫర్‌గఢ్ : తమ్మడపల్లి(ఐ)లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జఫర్‌గఢ్, అక్టోబర్ 27 : బీఆర్ఎస్ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీటీసీ ఇల్లందుల బేబీ కోరారు. శుక్రవారం మండలంలోని తమ్మడల్లి(ఐ), రామచంద్రుతండా, లక్ష్మీనాయక్‌తండా, సాగరం గ్రామాల్లో క్లస్టర్ ఇన్‌చార్జి ఇల్లందుల శ్రీనివాస్, తమ్మడపల్లి(ఐ) సర్పంచ్ గాదెపాక అనిత, సాగరం మాజీ సర్పంచ్ వట్టి ఇన్నారెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి గడప గడపకూ బీఆర్ఎస్ కార్యక్రమంలో జడ్పీటీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సీఎం కేసీఆర్ గత పదేళ్లలో చేపట్టి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు రాజకీయాలకతీతంగా ప్రతి ఇంటికి అందాయని ఆమె గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కేసీఆర్ రూపొందించారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గాదెపాక సుధాకర్‌బాబు, మంద మల్లయ్య, లోనే నాగేశ్వర్‌రావు, వజీరు యువ రాజు, నాయకులు కొత్త సాంబరాజు, మంద రాజయ్య, జోగు స్వామి, చేతన్, గజ్జి రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను గెలిపించండి

**వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి**

స్టేషన్ ఘన్‌పూర్ : గ్రామాల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని తాటికొండలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోగుల సారంగపాణి, సర్పంచ్ ఉమా సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాపోలు మధుసూదన్ రెడ్డి, నగరబోయిన యాదగిరి, గ్రామ అధ్యక్షుడు పొన్న శ్రీనివాస్, బూత్ కమిటీ సభ్యులతో కలిసి బీఆర్ఎస్‌ను గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత పాలకుల హయాంలో జరుగని అభివృద్ధిని పదేళ్లలో సీఎం కేసీఆర్ చేసి చూపించాడన్నారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేసే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మారపాక రాములు, ఐలయ్య, మహిళా నాయకురాలు హిమబిందు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దుబ్బతండాలో బీఆర్ఎస్ బూత్ కమిటీలను ఎంపిక చేస్తున్న నాయకులు

## గ్రామాల్లో బీఆర్ఎస్ బూత్ కమిటీల నియామకం

దేవరుప్పుల, అక్టోబర్ 27: మండల వ్యాప్తంగా గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బూత్‌ల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. మండల కమిటీతో పాటు, గ్రామాల ఇన్‌చార్జిలు గ్రామాలకు వెళ్లి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి బూత్ కమిటీలను ఎంపిక చేస్తున్నారు. ఎన్నికల వరకు ప్రచార బాధ్యతలు అప్పగిస్తున్నారు. మండలంలోని మాదాపురం, తూర్పుతండా, దుబ్బ తండా, దేవునిగుట్ట తండా, లకావత్ తండా(తూర్పు)ల్లో శుక్రవారం సమావేశాలు ఏర్పాటు చేశారు. మండల నాయకుడు బస్వ మల్లేశ్, ధరావత్ రాంసింగ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి నేతృత్వంలో కమిటీలను ఎన్నుకున్నారు. వంద మంది ఓటర్లకు ఓ కమిటీని నియమించి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనంతోజు కృష్ణమూర్తి, మండల అధికార ప్రతినిధి సుడిగెల హనుమంతు, వివిధ గ్రామ కమిటీల సభ్యులు, ప్రజాప్రతినిధులు, యూత్ కమిటీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



గాంధీచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

## కాంగ్రెస్ నేతలను గ్రామాల్లోకి రానివ్వొద్దు

**రైతు సంఘం నాయకుడు బుచ్చిరెడ్డి**

మరిపెడ, అక్టోబర్ 27 : రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో అడుగు పెట్టనివ్వొద్దని రైతు సంఘం జిల్లా నాయకుడు ముదిరెడ్డి బుచ్చిరెడ్డి నేతృత్వంలో అన్నదాతలు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిలోని గాంధీచౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా పంట పెట్టుబడి సాయం అందిస్తూ ఆదుకుంటుందన్నారు. ఆ సాయాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ కోరడం రైతాంగంపై వారికి ఉన్న కపట ప్రేమను చాటుకుంటుందన్నారు. ఎన్నికల ప్రచారం కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను తరిమి కొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీ లతీఫ్, జాటోత్ బాలజీ, మాచర్ల వెంకటేశ్వర్లు, దిగజర్ల శ్రీనివాస్, కిషన్‌నాయక్, కేలోత్ వస్రం నాయక్, జీఎన్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు ఉషా దయాకర్‌రావు పరామర్శ

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 27: మండలంలోని బమ్మెర, సిరిసన్నగూడెం, గూడోళ్ల గూడెం గ్రామాల్లో ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్ ఉషా దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, రైతు మండల అధ్యక్షుడు వీరమనేని యాకాంతారావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, వైఎస్ ఎంపీపీ దార శారదా శంకరయ్య, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, ఒంటేల మహేందర్‌రెడ్డి, ఆవుల రవి, బత్తిని గోపాల్, శివరాత్రి కొంరయ్య, గూడ రాఘువులు, నల్ల బుచ్చయ్య ఉన్నారు.



బమ్మెరలో బాధితులను పరామర్శించిన ఉషా దయాకర్‌రావు

# కాంగ్రెస్‌లో అసమ్మతి సెగ

- పశ్చిమ టికెట్‌పై పంచాయితీ
- రెండో జాబితాలో ఆరు స్థానాల అభ్యర్థుల ఖరారు
- పెండింగ్‌లో డోర్నకల్, ఇల్లందు సీట్లు
- బలరాంనాయక్, సిరిసిల్ల రాజయ్య, బెల్లయ్య నాయక్, వెంకట్రామిరెడ్డికి మొండిచేయి

వరంగల్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితాపై అసమ్మతి సెగలు మొదలయ్యాయి. వరంగల్ పశ్చిమ, పరకాల, మహబూబాబాద్, వర్ధన్నపేటలో టికెట్ల పంచాయితీ తీవ్రమవుతున్నది. వరంగల్ పశ్చిమలో టికెట్ ఆశించి భంగపడిన డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. కార్పొరేటర్లు, అనుచరులతో చర్చించి ఇండిపెండెంట్‌గా బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నాడు. వర్ధన్నపేటలోనూ అసమ్మతి తీవ్రమవుతున్నది. ఇక్కడ టికెట్ ఆశించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నమిండ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తాజా జాబితాతో అసంతృప్తికి గురయ్యారు. నియోజకవర్గంలో మెజారిటీ సంఖ్యలో ఉన్న మాదిగ వర్గానికి చెందిన తమను కాదని, నెల క్రితం పార్టీలో చేరిన మాల వర్గానికి చెందిన వారికి టికెట్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నాగరాజుకు సహకరించేది లేదని తేల్చి చెబుతున్నారు. మహబూబాబాద్‌లోనూ టికెట్ల పంచాయితీ రచ్చకెక్కబోతున్నది. కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ కీలక నేత బెల్లయ్య నాయక్ ఇక్కడ టికెట్ ఆశించారు. వారిని కాదని మురళీనాయక్‌కు టికెట్ ఇచ్చింది. దీంతో సీనియర్ నేతలు బలరాంనాయక్, బెల్లయ్యానాయక్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అధిష్టానం నిర్ణయంపై పరకాల సెగ్మెంటులోని హస్తం పార్టీ నాయకులు విస్తుపోతున్నారు. వారం క్రితం పార్టీలో చేరిన రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఇక్కడ టికెట్ ఇచ్చారు. అధిష్టానం నిర్ణయంతో పదేండ్లుగా పార్టీ కోసం కృషి చేస్తున్న ఇనుగాల వెంకట్రామిరెడ్డి తీవ్రంగా నిరాశకు గురయ్యారు. అనుచరులతో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. పాలకుర్తి టికెట్ తనకే అని ఇన్నాళ్లు ప్రచారం చేసుకున్న హనుమాండ్ల ఝాన్సీకి పౌరసత్వమే లేకపోవడంతో టికెట్ సైతం దక్కలేదు. కాంగ్రెస్ రెండో జాబితాలో ఉమ్మడి జిల్లాలోని ఏడు సెగ్మెంట్లతో పాటు హుస్నాబాద్, హుజూరాబాద్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. జనగామ- కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పాలకుర్తి- మామిడాల యశస్విని, మహబూబాబాద్- డాక్టర్ మురళీనాయక్, పరకాల- రేవూరి ప్రకాశ్ రెడ్డి, వరంగల్ పశ్చిమ- నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ తూర్పు - కొండా సురేఖ, వర్ధన్నపేట- కేఆర్ నాగరాజు, హుస్నాబాద్- పొన్నం ప్రభాకర్, హుజూరాబాద్- ఒడితల ప్రణవ్ కాంగ్రెస్ తరుపున బరిలో దిగుతున్నారు.

# దళారుల జోక్యం లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**డీపీఎం అనిల్**

లింగాలఘనపురం, అక్టోబర్ 27 : దళారుల బెడదను తొలగించేందుకే ఐకేపీల అధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీపీఎం అనిల్ తెలిపారు. మండలంలోని పటేలుగూడెం, నవాబుపేట, నెల్లుట్ల, కొత్తపెల్లి, వనపర్తి గ్రామాల్లో ఐకేపీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యాన్ని తరలించాలంటే రైతులకు వ్యయప్రయాసలకు గురి కావాల్సి వచ్చేదన్నారు. పంటలను అదే గ్రామంలో విక్రయించే వెసులుబాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో కలుగుతుందన్నారు. ఈ కేంద్రాల్లో ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, కామన్ గ్రేడ్‌కు రూ. 2,183 చెల్లిస్తారని వివరించారు. కార్యక్రమాల్లో సీసీలు శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్, మల్లేశం, వీఓఏలు బాబు, రేఖ, స్వరూప, సునీత, వీవో అధ్యక్షులు ఉమ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం అనిల్

### త్వరలో మరికొన్ని గ్రామాల్లో ప్రారంభం

దేవరుప్పుల : మండల కేంద్రంలో రెండు రోజుల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నది. ఐకేపీ ద్వారా మన్‌పహాడ్, సీతారాంపురం, నీర్మాల, రామరాజుపల్లి, దేవరుప్పుల, కొత్తవాడ, ధర్మాపురం, దేవునిగుట్ట తండాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటవుతుండగా శనివారం ప్రారంభించనున్నట్టు ఏపీఎం వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇక పీఏసీఎస్ ఆధ్వర్యంలో దేవరుప్పుల, సింగరాజుపల్లి సెంటర్లుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ప్యాక్స్ సీఈవో కృష్ణమూర్తి తెలిపారు. కాగా కేంద్రాలు రెండు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయన్నారు. అవసరాన్ని బట్టి మరిన్ని కేంద్రాలను పెంచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.